VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ నవంబర్ 17 ఆదివారం 2024
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 112
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## గులాబీ గూటికి కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చతికిలబడిపోతోంది. ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోవడం, ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ అధినాయకత్వం మీద గుర్రుగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ మనుగడ కష్టమేనని భావిస్తున్న హస్తం నాయకులు.. కారెక్కేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే రాజేంద్రనగర్ నియోజకవర్గం మణికొండ మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ నేత మాల్యాద్రి నాయుడు, ఇతర నాయకులు గులాబీ గూటికి చేరారు. వీరందరికి తెలంగాణ భవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## అఘాడీ కూటమి కంటే మాది భిన్నమైన అభివృద్ధి

**మహాయుతి ప్రభుత్వ హయంలో పరిపాలన అందించారు**

**మహారాష్ట్రలో పోటీ అంతా రెండు కూటముల మధ్యనే..**

**మహారాష్ట్రలో బీజేపీ కార్యకర్తలతో సమావేశంలో మోదీ**

**న్యూఢిల్లీ:** మహారాష్ట్రలో మరోసారి మహాయుతి ప్రభుత్వం రావాలని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారని ప్రధాని మోదీ అన్నారు. తమ కూటమి ప్రభుత్వ పనితీరుపై ఇక్కడి ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. సమాజంలోని ప్రతీ వర్గానికి సాధికారత కల్పించడమే తమ లక్ష్యమన్న ప్రధాని మోదీ.. అఘాడీ కూటమి కంటే తమది భిన్నమైన అభివృద్ధి పంథా అని ప్రకటించారు. మేరా బూత్ సబ్సే మజ్ బూత్ కార్యక్రమంలో భాగంగా..

మిగతా 2లో




2లో..

## మండల పూజ కోసం తెరుచుకున్న శబరిమల ఆలయం

## ఓవైసీ బ్రదర్స్ పై ఈసీకి ఫిర్యాదు!



2లో..

## విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోరా?



2లో..

**రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోంది?**

**ఏబీవీపీ నాయకులపై దాడి చేయడం దుర్మార్గం**

**ట్రిపుల్ ఐటీ ఘటనలపై కేంద్ర మంత్రి బండి సంజయ్**

# మేం 50 వేల కొలువులిచ్చాం..
# మీరేమిచ్చారు?



**10 నెలల్లోనే అనేక సంక్షేమ పథకాలు తెచ్చాం**

**మీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఏమైనా చేశారా?**

**మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం**

ముంబై: తెలంగాణలో తాము అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే నిరుద్యోగులకు 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని.. బీజేపీ అధికారంలో ఉన్న ప్రధాని నరేంద్రమోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఇలా ఇవ్వగలిగారా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు తన ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నదని చెప్పారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం విదర్భ ప్రాంతంలోని చంద్రపూర్, రాజురా, దిగ్రాస్, వార్ధా, నాగ్‌పూర్ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి అభ్యర్థుల తరపున రేవంత్ ప్రచారం చేశారు. తెలంగాణలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. ఇప్పటివరకు 1.10 కోట్ల మంది మహిళలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారని వివరించారు. రూ.500 కే వంటగ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని, 25 లక్షల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వెల్లడించారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటాయని విశ్వసించి అధికారంలోకి వచ్చిన 25 రోజుల్లోనే తాము రూ.18 వేల కోట్లు ఖర్చుచేసి ఒక్కో రైతుకు రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసినట్లు చెప్పారు. బందిపోటు ముఠాను తరిమికొట్టండి ముంబైని దోచుకోవాలని చూస్తున్న బీజేపీ బందిపోటు ముఠాను తరిమికొట్టాలని మహారాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. వెన్నుపోటు రాజకీయాలను పాతిపెట్టాలని కోరారు. ముంబైని కొల్లగొట్టేందుకే ప్రధాని మోదీ, అదానీ కలిసి వస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్‌లు గుజరాత్‌కు గులాంలుగా మారిపోయారని మండిపడ్డారు.

ఎంవీఏ కూటమి అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలన్నిటినీ అమలు చేస్తుందని రేవంత్‌రెడ్డి

హామీ ఇచ్చారు.

మహారాష్ట్రలో జరుగుతున్నవి ఎన్నికలు కాదని.. అది ఒక పోరాటమని అభివర్ణించారు. ఈ పోరాటంలో ఎంవీఏను గెలిపించాలని కోరారు.

కాగా, ప్రచార సభలు, నాగ్‌పూర్ రోడ్‌షో సందర్భంగా రేవంత్‌రెడ్డికి స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు.

## జనవరిలో మెట్రో రైల్ ఫేజ్-2 పనులు

మెట్రోరైల్ ఫేజ్-2 పనులు జనవరిలో ప్రారంభం కానున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



4లో

**ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులు, నక్సలైట్లకు మధ్య**

## ఎదురుకాల్పులు

కాల్పుల్లో మరణించిన నక్సలైట్లు..?

ఇంకా ధృవీకరించని పోలీసు వర్గాలు



2లో

## లగచర్ల ఘటనలో దర్యాప్తు ముమ్మరం



**మరె 8మంది అరెస్ట్..**

**కలెక్టర్‌కు అదనపు భద్రత**

**వికారాబాద్:** లగచర్లలో అధికారులపై దాడి కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. తాజాగా మరో 8 మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. వీరిని పరిగి పోలీసు స్టేషన్‌కు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరచనున్నారు. ఈ కేసులో ఇప్పటికే 17 మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చర్లపల్లి జైలులో ఉన్నారు, మిగతా 16 మందిని పరిగి నుంచి సంగారెడ్డి జైలుకు తరలించారు. మరోవైపు లగచర్ల ఘటనపై వికారాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో డీజీ మహేశ్ భగవత్ వివరాలు సేకరిస్తున్నారు. లగచర్లతో పాటు పరిసర గ్రామాల్లో పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. పరారీలో ఉన్నవారి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. ఇదిలావుంటే వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడి జరిగిన క్రమంలో ఆయనకు భద్రతను పెంచారు. కలెక్టర్‌కు అదనంగా ఇద్దరు ఏఆర్ గన్‌మెన్‌లను పోలీస్ శాఖ కేటాయించింది. ఇండస్ట్రియల్‌కారిడార్ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై లగచర్లలో దాడి జరిగిన సంగతి తెలిసిందే. వికారాబాద్ జిల్లా దుద్యాల, లగచర్ల, పోలేపల్లిలోని 1,350 ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్‌ఏర్పాటు కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. మొదట ఫార్మా విలేజ్ ఏర్పాటు చేద్దామని అనుకున్నా స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు నిర్ణయించింది.

## ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులు, నక్సలైట్లకు మధ్య ఎదురుకాల్పులు

**ఛత్తీస్‌గఢ్:** ఛత్తీస్‌గఢ్ కంకేర్, నారాయణపూర్ జిల్లాల సరిహద్దులోని మాద్ ప్రాంతంలో పోలీసులకు, నక్సలైట్లకు మధ్య కాల్పులు జరుగుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌ను ఛత్తీస్‌గఢ్ పోలీసులు ధృవీకరించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో చాలా మంది నక్సలైట్లు మరణించినట్లు తెలుస్తుంది. కానీ ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. ఎదురు కాల్పుల్లో పలువురు నక్సలైట్‌లు మరణించారని, ఘటనా స్థలం నుంచి పోలీసులు భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారని సమాచారం. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. కాగా ఛత్తీస్‌గఢ్‌లో అతిపెద్ద నక్సల్స్ ఆపరేషన్ అక్టోబర్ 4న అబుజ్మడ్ అడవుల్లో జరిగింది. నక్సలైట్లపై నిర్వహించిన ఆ యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో 31 మంది నక్సలైట్లు మరణించారు. ఎన్‌కౌంటర్ జరిగిన పది రోజుల తర్వాత అక్టోబర్ 14న మావోయిస్టులు విడుదల చేసిన ప్రెస్ నోట్‌లో ఎన్‌కౌంటర్‌లో మరణించిన నక్సల్స్ 31 మంది కాదని, మొత్తం 35 మంది అని పేర్కొన్నారు. అక్టోబర్ 18న బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ మాట్లాడుతూ.. ఆ ఎన్‌కౌంటర్‌లో మొత్తం 38 మంది నక్సలైట్లు మరణించారని తెలిపారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో విమానానికి బాంబు బెదిరింపు

హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. హైదరాబాద్ నుంచి బ్యాంకాక్ వెళ్లాల్సిన విమానం గేటు వద్దకు రాగానే బాంబు ఉందంటూ ఓ ప్రయాణికుడు అలజడి సృష్టించాడు. వెంటనే అప్రమత్తమైన సీఐఎస్ఎఫ్ సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో విమానంలో 136 మంది ప్రయాణికులు ఉన్నారు. విమానాన్ని ఐసోలేషన్ ప్రాంత్రానికి తీసుకెళ్లి తనిఖీలు చేశారు. ఎలాంటి బాంబూ లేదని తేల్చారు. గత కొన్నిరోజులుగా విమానాలకు నకిలీ బాంబు బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం నాగ్‌పూర్ విమానానికి కూడా బెదిరింపు వచ్చింది. అయితే అది ఉత్తదేనని నిర్ధారించారు. ఈ నెల 14న ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు రావడం అలజడి సృష్టించింది. గుర్తు తెలియని వ్యక్తి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశాడు. ముంబై నుంచి అజర్‌బైజాన్‌కు వెళ్తున్న విమానంలో మహమ్మద్ అనే వ్యక్తి బాంబులను తీసుకెళ్తున్నాడని హెచ్చరించాడు. దీంతో సీఐఎస్ఎఫ్, స్థానిక పోలీసులు ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో తనిఖీలు నిర్వహించగా ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. ఈ నేపథ్యంలో బెదింపులకు పాల్పడే వ్యక్తులపై విమాన ప్రయాణ నిషేధం విధించాలని పౌర విమానయాన శాఖ ఆలోచిస్తున్నది.

## విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోరా?

హైదరాబాద్: ట్రిపుల్ ఐటీ ముట్టడికి వెళ్తున్న ఏబీవీపీ నాయకులు అరెస్ట్‌లను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఖండించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ స్పందిస్తూ.. ఏబీవీపీ నాయకులపై పోలీసుల, బాసర ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఆత్మహత్య చేసుకున్న బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి న్యాయం చేయమంటే విచక్షణారహితంగా దాడి చేయిస్తారా? అని, బాసర ట్రిపుల్ లో పరిస్థితి రోజురోజుకూ దిగజారుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోంది? విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోరా? అని ఆయన ప్రశ్నించారు. అంతేకాకుండా.. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ఎందుకు పరిష్కరించడం లేదు? అని, విద్యార్థుల పక్షాన ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులను ఎక్కడికక్కడ అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని ఆయన మండిపడ్డారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు బండి సంజయ్. ట్రిపుల్ ఐటీ విద్యార్థి స్వాతి ప్రియ ఆత్మహత్యకు కారణాలపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న స్వాతిప్రియ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని బండి సంజయ్ అన్నారు. అరెస్ట్ చేసిన ఏబీవీపీ నాయకులను తక్షణమే విడుదల చేయాలని, ఇంకా జాప్యం చేయకుండా బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు బండి సంజయ్.

## ప్రతిపక్షం ఫామ్‌హౌస్‌కే పరిమితమైంది

హైదరాబాద్: గత పదేళ్లపాలన కంటే పదకొండు నెలల్లో మెరుగైన పాలన అందించామని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా నేతలతో మహేశ్ కుమార్ గౌడ్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య పాత్ర పోశించిందని అభిప్రాయపడ్డారు. పోరాటాలకు, చైతన్యానికి వరంగల్ మారు పేరు అని కొనియాడారు. ఈనెల 19న వరంగల్ లో నిర్వహించబోయే మహిళా సదస్సులో లక్షమంది మహిళలు పాల్గొంటారని అన్నారు. ఈ సదస్సులో 11 నెలల ప్రజాపాలనను సీఎం వివరిస్తారని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని ప్రజలు అనుకున్నారని కానీ కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో భూముల దోపిడీ అంతా ఇంతా కాదని మండిపడ్డారు. రాష్ట్రంలో విద్యా విధానం మారాలనే యంగ్ ఇండియా స్కూళ్లను తీసుకువచ్చామని చెప్పారు. దేశానికి ఆదర్శంగా ఉండేలా వైద్య రంగంలో మార్పులు తీసుకువస్తున్నామని అన్నారు. ప్రతిపక్షాలు బలంగా ఉండాలని కాంగ్రెస్ కోరుకుంటుందని కానీ బీఆర్ఎస్ ఫామ్ హౌస్ కే పరిమితమైందని ఆరోపించారు.

రాష్ట్రంలో ప్రతిపక్షం కూడా లేకుండా పోయిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీనే ఉండదని స్పష్టం చేశారు. బీజేపీ కులమతాల పేరుతో రాజకీయాలు చేస్తూ ఉనికి కోసం ప్రయత్నిస్తోందని చెప్పారు. తొమ్మిది నెలల్లోనే 48వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. పదేళలో బీఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాల కంటే తమ ప్రభుత్వం తొమ్మిది నెలలో ఇచ్చిన ఉద్యోగాలే ఎక్కువ అని అన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ యాభైవేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని ఆరోపించారు.

# అఘాడీ కూటమి కంటే మాది భిన్నమైన అభివృద్ధి



మహారాష్ట్రకు చెందిన బీజేపీ కార్యకర్తలతో సమావేశమైన మోదీ.. మరోసారి మహారాష్ట్రలో బీజేపీ కూటమి విజయం సాధిస్తుందంటూ భరోసా కల్పించారు. 2.5 ఏళ్ల మహాయుతి ప్రభుత్వ హయంలో మహారాష్ట్ర ప్రజలకు మంచి పరిపాలన అందించారని ప్రశంసించిన మోదీ.. ప్రజలు సైతం అత్యంత సంతృప్తిగా ఉన్నారన్నారు. అందుకే..రానున్న ఐదేళ్లు మనమే ఉండాలని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారంటూ ప్రకటించారు. ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తల కృషిని ప్రశంసించిన ప్రధాని మోదీ.. మీ అవిశ్రాంతి ప్రయత్నాల వల్లే పార్టీ ఈ తీరుగా బలపడింది అంటూ అభినందనలు తెలిపారు. నెలల తరబడి పార్టీ కోసం కార్యకర్తల పడిన కష్టాలకు ప్రతిఫలం మరికొన్ని రోజుల్లోనే వస్తుందన్నారు. అయితే.. ఎలక్షన్ల వరకు ఇలానే కృషి చేయాలంటూ కార్యకర్తలకు కర్తవ్య బోధ చేశారు. కాగా.. మహారాష్ట్రలో పోటీ అంతా రెండు కూటముల మధ్యనే ఉంది. ఇందులో మహాయుతి కూటమిలో భారతీయ జనతా పార్టీ (బిజెపి), ఏక్‌నాథ్ షిండే శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) ఉన్నాయి. మరోవైపు, ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి )లో కాంగ్రెస్, ఉద్ధవ్ థాకరేకి చెందిన శివసేన శరద్ పవార్ వర్గానికి చెందిన , అఖిలేష్ యాదవ్ సమాజ్ వాదీ పార్టీ, ఇతర కొన్ని చిన్న పార్టీలు కలిసి పోటీ చేస్తున్నాయి.

## మండల పూజ కోసం తెరుచుకున్న శబరిమల ఆలయం

**పాతానమిట్టె:** శబరిమల అయ్యప్పకు చెందిన మండల పూజా సీజన్ ప్రారంభమైంది. ఇవాళ అయ్యప్ప ఆలయాన్ని తెరిచారు. వేల సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామున ప్రధాన పూజారి అరుణ్ కుమార్ నంబూద్రి ఆలయ ద్వారాలను తెరిచారు. తలుపులు తీయగానే.. శరణం అయ్యప్ప అంటూ శబరిమల ఊగిపోయింది. శుక్రవారం నుంచే సన్నిధానంకు భక్తుల రాక మొదలైంది. వర్చువల్ క్యూ విధానం ద్వారా శనివారం 70 వేల మంది భక్తులు బుకింగ్ చేసుకున్నారు. స్పాట్ బుకింగ్‌ల ద్వారా మరో 10 వేల మంది బుక్ చేసుకునే అవకాశం ఉన్నది. అయ్యప్ప స్వామి ఆలయాన్ని మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు మూసివేయనున్నారు. ఆ తర్వాత రాత్రి 11 గంటల వరకు దర్శనం ఉంటుంది. ప్రతి రోజు నెయ్యి అభిషేకం తెల్లవారుజామున 3.30 నిమిషాలకు ప్రారంభం అవుతుంది. ఉదయం 7.30 నిమిషాలకు ఉషా పూజ ఉంటుంది. మధ్యాహ్నం 12.30 నిమిషాలకు ఉచ్చ పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నిమిషాలకు దీపారాధాన ఉంటుంది. రాత్రి 9.30 నిమిషాలకు అతజాపూజ నిర్వహిస్తారు. భారీ సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో దర్శన సమయాన్ని రోజుకు 18 గంటలకు పెంచారు. మండల పూజ సీజన్ సందర్భంగా తొలి రెండు వారాల పాటు వర్చువల్ క్యూ బుకింగ్ ఫుల్ అయ్యింది. 14 రోజుల వరకు బుకింగ్ ఖాళీ లేదు. నవంబర్ 30వ తేదీ కోసం ఆరు వేల స్లాట్లు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. ప్రతి రోజు వర్చువల్ క్యూ బుకింగ్ ద్వారా 70 వేల మంది దర్శనం చేసుకోనున్నారు. పంపా, ఎరుమేలి, సాత్రం వద్ద స్పాట్ బుకింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పంపా స్పాట్ బుకింగ్ సెంటర్ వద్ద భారీగా జనం ఉన్నట్లు తెలుస్తోంది.

## వాజ్‌పేయ్ పునాదులు వేస్తే..మోడీ బలోపేతం చేశారు

**న్యూఢిల్లీ:** తెలుగుదేశం పార్టీ తొలి నుంచీ దేశ రాజీయాల్లో కీలక పాత్ర పోషించిందని ఎపి సిఎం చంద్రబాబు గుర్తు చేశారు. దేశాభివృద్ధి కోసం తెలుగుదేశం ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. భాజపాకి వాజ్‌పేయీ పునాదులు వేస్తే.. నరేంద్రమోదీ బలోపేతం చేశారు. మోదీ నేతృత్వంలో దేశం ఆర్థికంగా బలంగా తయారవుతోందని, రానున్న రోజుల్లో ప్రపంచంలో భారతదేశం రెండు, మూడు స్థానాల్లో ఉంటుందని అన్నారు. నరేంద్రమోదీ మా నాయకుడు. ఆయన నేతృత్వంలోనే ముందుకు వెళ్తాం. హరియాణా సీఎం ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ప్రధాని ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమి సీఎంల సమావేశం జరిగింది. నాలుగు గంటల పాటు జరిగిన సమావేశంలో 2029 ఎన్నికలకు ఏ విధంగా సమాయత్తం అవ్వాలనే విషయంపై మోదీ అందరి అభిప్రాయాలు తీసుకున్నారు. దిల్లీలో పర్యటించిన చంద్రబాబు.. హిందూస్థాన్ టైమ్స్ లీడర్ షిప్ సమ్మిట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పుడు చైనా, జపాన్ సహా అనేక ప్రపంచ దేశాల్లో వయోధికులు ఎక్కువైపోయారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో ఈ సమస్య ప్రారంభమైంది. ఫెర్టిలిటీ రేటు ఇక్కడ తగ్గిపోతోంది. సాధారణంగా ఇది 2.1 కంటే ఎక్కువగా ఉంటే సమస్య ఉండదు. ప్రస్తుతం బోర్డర్ లైన్‌లో జననాల రేటు ఉంది. ఇది కాస్త తగ్గితే జపాన్, చైనా మాదిరి సమస్య మన దేశంలో కూడా మొదలవుతుంది. భారతదేశంలో 145 కోట్ల జనాభా ఉంది. పాపులేషన్ మేనేజ్‌మెంట్ చేస్తే ప్రపంచంలో మనల్ని కొట్టేవారే ఉండరు. మనం ఒక ప్రణాళికాబద్ధంగా అమల్లోకి తీసుకువస్తే.. 30-40 కోట్ల మంది భారతీయులు ప్రపంచంలో అన్ని మూలలకు వెళ్లి పని చేసి దేశానికి ఆదాయం తీసుకొస్తారు. బ్రిటీష్ వాళ్లు భారత్‌కి వచ్చి పరిపాలించిన తరహాలో మనం కూడా ప్రపంచదేశాలకు వెళ్లి ఆ దేశాలను ఏలుతాం. ఒకప్పుడు ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా నిబంధనలు పెట్టాను. ఇప్పుడు ఆ నిబంధన తొలగించి... కనీసం ఇద్దరు పిల్లలు ఉంటే తప్ప పోటీకి అర్హత లేదని పెట్టాలని చెబుతున్నా. మానవ వనరులు, నైపుణ్యాల అభివృద్ధి జరగాలి.. దానికి అనుగుణంగా పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ కల్పన జరగాలి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఒకటో తరగతి నుంచే ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఏపీలో కూడా 2029 ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం అవుతున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తితో పాటు.. ఎన్డీఏ కూటమిపై జనానికి భరోసా కలిగింది. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా వస్తాయని మేం ముందుగానే ఊహించాం. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 57 శాతం ఓట్లు..

93 శాతం సీట్లు కూటమికి ప్రజలు ఇచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా పవన్ కల్యాణ్ మూడు పార్టీలను కలిపారు. దాని ఫలితం ఇప్పుడు చూశాం. జాతీయ స్థాయిలో కూడా భాజపాకి పూర్తి మెజారిటీ వస్తుందని అనుకున్నాం. కూటమిలో ఎటువంటి సమస్యలు లేవు, అందరం కలిసికట్టుగా ముందుకు సాగుతున్నాం. మా కూటమి దీర్ఘకాలం కొనసాగుతుందని చంద్రబాబు అన్నారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం దారుణమని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. గత వైకాపా పాలనలోనూ..ఇప్పుడూ ఇలాంటి దురాగతాలు లెక్కకు మిక్కిలి చోటుచేసుకోవడం దారుణమన్నారు. సోషల్ మీడియాలో విపరీత ధోరణులు కనిపిస్తున్నాయని. వ్యక్తిత్వ హననం జరుగుతోందన్నారు.

## ఓవైసీ బ్రదర్స్ పై ఈసీకి ఫిర్యాదు!

**హైదరాబాద్:** ప్రజల మధ్య కల్లోలం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, ఆయన సోదరుడు అక్బరుద్దీన్ ఓవైసీలపై చర్యలు తీసుకోవాలని మహారాష్ట్ర చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్, ముంబై పోలీసు కమిషనర్ లకు శివసేన లేఖ రాసింది. ఇటీవల షోలాపూర్ లో జరిగిన ఓ బహిరంగ సభలో వీరు ఇచ్చిన ప్రసంగాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని ఆరోపించింది. ఈ మేరకు శివసేన సోషల్ మీడియా ఇంఛార్జ్ రహూల్ కనాల్ పోల్ ప్యానెల్ రాసిన లేఖలో ఓవైసీ సోదరులు తమ ప్రసంగాల ద్వారా రాష్ట్రంలోని వివిధ వర్గాల వారి మనోభావాలను దెబ్బతీశారని పేర్కొన్నారు. ఓవైసీ సోదరుల ప్రసంగంలో ప్రజాశాంతికి భంగం కలిగించే ప్రకటనలు ఉన్నాయని తెలిపారు. మతం ప్రాతిపదికన శత్రుత్వం, మతాల మధ్య విభజను సృష్టించడం లాంటివి ఉన్నాయని పేర్కొన్నారు. మత సామరస్యానికి విఘాతం కలిగించడం, సమాజంలో అశాంతి సృష్టించడం లక్ష్యంగా ఓవైసీ సోదరుల ప్రసంగం ఉందని, వారి ప్రసంగంలో నేరపూరిత కంటెంట్ స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు.

వారి ఉద్వేగభరితమైన ప్రసంగాల వల్ల ప్రజల భద్రతకు తీవ్రమైన ముప్పు ఉందని సంచలన ఆరోపణలు చేశారు. ఓవైసీ సోదరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, ఓవైసీ బ్రదర్స్ ప్రసంగం వీడియో ఆధారంగా సమగ్ర విచారణ జరిపి దర్యాప్తు చేయాలని పోలీసులను కోరారు. చర్యలు తీసుకుంటేనే మరోసారి ఇలాంటివి జరగకుండా ఉంటాయని అధికారులకు తెలిపారు.

# అసెంబ్లీ సమావేశాలు వన్ సైడ్...

**ఎంత వరకు... ఉపయోగం**

విజయవాడ: ప్రజాస్వామ్యంలో అసెంబ్లీ దేవాలయం లాంటిది. ఎన్నికలు జరిగేది ప్రజాప్రతినిధుల్ని ఎన్నుకోవడానికి. వారు చేయాల్సిన పని అసెంబ్లీలో చర్చించి చట్టాలు చేయడం.. ప్రజాసమస్యలపై మాట్లాడటం. అలాంటి సభ నిస్సారంగా జరిగితే..వన్ సైడెడ్‌గా ఉంటే ప్రజలకు కూడా ఆసక్తి ఉండదు. కానీ ఇప్పుడు ఏపీలో అదే జరుగుతోంది. వైసీపీ అసెంబ్లీని బహిష్కరిస్తామని రానే రాబోమని స్పష్టం చేసింది. అయితే అధికార పక్షం వైసీపీని సభకు వచ్చేలా చేయడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. అధికారపక్షం చొరవ తీసుకుని వైసీపీతో సంప్రదింపులు జరపాలన్న అభిప్రాయం వినిపిస్తోంది. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు హోరాహోరీగా సాగుతున్నాయి. గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో పెద్దగా చర్చలకు అవకాశం ఉండేది కాదు. కానీ ఇప్పుడు ప్రతి అంశంపై విస్తృతంగా చర్చిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు ఆసక్తి రేపేలా ఉంటున్నాయి. అయితే ఏపీ అసెంబ్లీ సమావేశాలు మాత్రం ఏకపక్షంగా మారిపోయాయి. విపక్షంగా పూర్తి స్థాయిలో బాయ్ కాట్ చేయాలని నిర్ణమయించడమే దీనికి కారణం. మొదటి సమావేశాల సమయంలో అందరూ హాజరయ్యారు. కాకపోతే అప్పుడు ప్రమాణ స్వీకారాల సమయం. చర్చలు జరగలేదు. అయినా ఆ




సమావేశాలపై ప్రజలు ఆసక్తి చూపించారు. కానీ బడ్జెట్ సమావేశాల్లో విపక్షం లేకపోవడంతో అక్కడ ప్రజాసమస్యలపై చర్చలు జరిగినా ప్రశ్నించడానికి ప్రతిపక్షంలేదు కాబట్టి ప్రజలు కూడా ఆసక్తి చూపించడం మానేశారు. ప్రతిపక్షం ప్రజాతీర్పును గౌరవించి సభకు వెళ్లాలన్న అభిప్రాయం ప్రజాస్వామ్య వాదుల్లో వినిపిస్తోంది. ప్రతిపక్ష నేతగా జగన్ ప్రజల తరపున మాట్లాడాల్సి ఉంది. అయితే జగన్ తనకు ప్రతిపక్ష నేత హోదా స్పీకర్ ఇవ్వాలంటున్నారు. కానీ అలా ఇచ్చేది తాము కాదని ప్రజలే అని.. ప్రజలు ఇవ్వలేదని స్పీకర్ తేల్చేస్తున్నారు. తాము కాక మరో పార్టీ లేనప్పుడు ఇంకెవరికి ప్రతిపక్ష హోదా ఇస్తారని జగన్ ప్రశ్నిస్తున్నారు. ఆయన వాదనలో మెరిట్ ఉందా లేదా అన్న సంగతి పక్కన పెడితే.. హోదా ఉన్నా లేకపోయినా జగన్మోహన్ రెడ్డి ఖచ్చితంగా ప్రతిపక్ష నేతే. దాన్ని ఎవరూ కాదనలేరు. ఆ హోదాలో ఆయన ప్రశ్నించవచ్చు. మాట్లాడేందుకు సమయం ఇస్తారా లేదా అన్నది తర్వాత సంగతి ముందు అసెంబ్లీకి వెళ్తేనే కదా ఆ విషయం తెలుస్తుందని సహజంగా ప్రజలకు వచ్చే సందేహం. దీనిపై తర్వాత అయినా వైసీపీ ప్రజలకు సమాధానం చెప్పుకోవాల్సిందే. జగన్ అసెంబ్లీకి రావాలని అయ్యన్నపాత్రుడు చాలా సార్లు పిలుపునిచ్చారు. కానీ ప్రభుత్వం వైపు నుంచి మాత్రం ఎలాంటి ప్రయత్నం జరగలేదదు. సాధారణంగా సభా వ్యవహారాల్లో ప్రతిష్టంభన ఏర్పడినప్పుడు చర్చలు జరుపుకుని సభను నిర్వహించుకుంటారు. అలాగే ఇప్పుడు కూడా వైసీపీతో టీడీపీ నేతలు సంప్రదింపులు జరపాలని అంటున్నారు. జగన్ కు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వకపోయినా.. ఇతర అంశాలపై ఒప్పించి వారిని సభకు వచ్చేలా చూడాలని అంటున్నారు. అయితే ఇప్పటి వరకూ అధికారపక్షం నుంచి ఇలాంటి ప్రయత్నాలు జరగలేదు. టీడీపీ ఈ విషయంలో కాస్త చొరవ తీసుకుంటే ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడినట్లు ఉంటుందన్న అభిప్రాయం మాత్రం వినిపిస్తోంది. మరి టీడీపీ ఆ విషయంలో ఏమైనా ఆలోచిస్తుందా.. రాకపోతే మాకే మంచిదని సైలెంట్‌గా ఉంటుందా ?

# సిక్కోలు వైసీపీలో ప్రక్షాళన



శ్రీకాకుళం:శ్రీకాకుళం జిల్లాలో కీలకమైన టెక్కలి, ఆమదాలవలస నియోజకవర్గాల సమన్వయకర్తలను మార్చిన అధినేత జగన్మోహన్ రెడ్డి తర్వాత ఏ నియోజకవర్గ నేతనుమారుస్తారోనన్న ఉత్కంఠ పార్టీ క్యాడర్ లో నెలకొంది. 2024 సార్వత్రికఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లాలో ఒక్క నియోజకవర్గంలో కూడా గెలవలేదు. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానంతో పాటు శ్రీకాకుళం,నరసన్నపేట, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, పాతపట్నం ,ఆమదావలస, ఎచ్చెర్ల శాసనసభ స్థానాలలో కూడా ఓటమి చవిచూసింది. ఎన్నికలలో పోటీ చేసిన నేతలే పార్టీ ఇన్ చార్జీలుగా ఉండేవారు.రాష్ట్రంలో వైకాపా ఘోర ఓటమి చెందడానికి గల కారణాలపై అధినేతజగన్మోహన్ రెడ్డి పార్టీ నాయకులతో మాట్లాడి ఫీడ్ బ్యాక్ నుతీసుకున్నారు. అధైర్యపడవద్దని 2029 ఎన్నికలలో ఖచ్చితంగాగెలిచితీరుతామని అందుకోసం ఇప్పటి నుంచే పనిచేయాలని కూడా నేతలకి ఆయన దిశా నిర్దేశం చేసారు. అంతేకాకుండా వైకాపాబలోపేతం కోసం చర్యలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా వైకాపా అధ్యక్షుడుగా నాల్గవ సారి ధర్మాన కృష్ణదాస్ ను నియమించారు. అలాగే సీనియర్ లీడర్ తమ్మినేని సీతారాంని శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులుగా బాధ్యతలను అప్పగించారు. జిల్లాలో అన్ని నియోజకవర్గ నాయకులతో కలసి కార్యవర్గాన్ని ఏర్పాటుచేయడంతో పాటు అనుబంధ విభాగాలను పటిష్టం చేయాలని జగన్మోహన్ రెడ్డి సూచించారు. టెక్కలినియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న ఎంఎల్ సి దువ్వాడ శ్రీనివాస్ ను తొలుత తొలగించి ఆయన స్థానంలో ఆ నియోజకవర్గానికి చెందిన అదే సామాజిక వర్గానికి చెందిన పేరాడ తిలక్ ను కొత్త సమన్వయకర్తగా నియమించారు. దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారం రచ్చకెక్కడం, దానిపై పెద్ద ఎత్తున విమర్శలు హె?రెత్తడంతో అధినేత ఆయనను తొలగించి తిలక్ కి సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించారు. తాజాగా ఆమదాలవలస నియోజకవర్గ ఇన్ చార్జిగా ఉన్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను తప్పించి అక్కడ సమన్వయకర్తగా వైకాపా యువనాయకుడు చింతాడ రవికుమార్ ను నియమించారు. 2014-19 మధ్య వైకాపా ప్రతిపక్షంలో ఉండగా తమ్మినేని సీతారాం ఆముదాలవలసలో పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేశారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ నియోజకవర్గ వాసుల అభిమానాన్ని చూరగొన్నారు. ఈ కారణంగా ఆయన 2019లో విజయం సాధించగా సీనియార్టీని గుర్తించి జగన్మోహన్ రెడ్డి ఆయనకి శాసనసభ స్పీకర్ పదవిని కట్టబెట్టారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అనుసరించిన విధానాలను ప్రజలు పెద్ద ఎత్తున వ్యతిరేకించి 2024 ఎన్నికలలో గంపగుత్తగా ఎన్ డిఏ కూటమి అభ్యర్థులకి ఓట్లు వేయడంతో వైకాపాకి గట్టి దెబ్బతగిలింది. అందరితో పాటే తమ్మినేని సీతారాం సైతం ఓటమి పాలయ్యారు. అయినా కూడా ఆమదాలవలస నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ముందుకు సాగుతూ వచ్చారు. అయితే ఎవ్వరూ ఊహించని విదంగా ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్తగాచింతాడ రవికుమార్ ను జగన్మోహన్ రెడ్డి నియమించారు. ఈ నియామకంపై తమ్మినేని కుటుంబ అభిమానులు, అనుచరులు తీవ్ర నిరాశకి గురయ్యారు. పెద్దాయనను తప్పించి యువకుడుని నియమించడంపై అక్కడ బిన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని టెక్కలి, ఆమదాలవలస రెండు నియోజకవర్గాలు కూడా కీలకమైనవే. కళింగ సామాజిక వర్గం హవా ఉండే ఆ నియోజకవర్గాలలో సమన్వయకర్తలను మార్చివేయడం ఆ సామాజిక వర్గంలో కూడా చర్చణీయాంశంగా మారింది.రెండు నియోజకవర్గాలలో ఇన్ చార్జిలను మార్చిన జగన్మోహన్ రెడ్డి తర్వాత ఇంకే నియోజకవర్గాలలో కొత్త సమన్వయకర్తలను నియమిస్తారోనని ఎవరికి వారు చర్చించుకుంటున్నారు.

# కాంగ్రెస్ కూటమి మాయమాటలు నమ్మి మోసపోవద్దు.







**వేగుచుక్క న్యూస్, నవంబర్ 16:**

## అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్త.

## మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే దన్ పాల్ జోరుగా ప్రచారం.

కాంగ్రెస్ కూటమి మాయమాటలు నమ్మి మోసపోవద్దని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్త అన్నారు. భారతీయ జనతా మహాయుత కూటమి ఆధ్వర్యంలో భోకర్ తాలూకా పాలజ్ లో శనివారం నిర్వహించిన భారీ బహిరంగ సభకు ముఖ్యఅతిథులుగా ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ రావు చౌహన్ తో నిజామాబాదు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అధికారంలోకి రాగానే విస్మరిస్తూ ప్రజలను మోసాగిస్తుందని అన్నారు. అందుకు కర్ణాటక, తెలంగాణలో గ్యారంటీల పేరుతో మోసం చేసి వందరోజుల్లో అమలు చేస్తానని సంవత్సరం కావొస్తున్న ఇప్పటికి ఒక్క గ్యారంటీ పూర్తిగా అమలు చేసిన దిక్కు లేని పరిస్థితే నిదర్శనం అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలో ప్రజల విశ్వసాన్ని కోల్పోయి పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 8 బిజెపి స్థానాలను గెలిపించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ 60 ఏళ్ల పాలన అవినీతి కుంభకొణాల మయం అని, అటువంటి పాలనకు భారత దేశ ప్రజలు ఎప్పుడో చరమగీతం పాడారని అన్నారు. మరాఠ ప్రజలు కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి మోసపోయి గోసపడొద్దని అన్నారు. బిజెపి కేంద్రప్రభుత్వం నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. అవస్ యోజన, ఉజ్వల యోజన, సుకన్య సమృద్ధి యోజన, కిసాన్ సన్మాన్ యోజన, ఇలా అనేక పథకాలు చిట్టచివరి పేదోనికి ఎలాంటి అవినీతి లేకుండా అందుతున్నాయని పేర్కొన్నారు. కాగా మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.



# కేశ వేణు, గడుగు గంగాధర్ కు సన్మానం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 16:**

నుడా ఛైర్మన్ కేశ వేణు, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్‌ను పాలిటెక్నిక్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. వారిద్దరూ రాజకీయాల్లో ఇంకా ఎదగాలని, ప్రజలకు సేవలు అందించాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు.

# రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు "సత్యశోధక్" విద్యార్థులు.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, నవంబర్ 16**



తెలంగాణ స్కూల్ గేమ్స్ బేస్ బాల్ ఆధ్వర్యంలో ఈ నెల16 నుండి 18 వరకు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్ 17) బేస్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 14న ఆర్మూర్ లో జరిగిన జిల్లాస్థాయి జూనియర్ బేస్ బాల్ ఎంపిక పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన పాఠశాలకు చెందిన జి. సాయికిరణ్, ఎం. చందులను శనివారం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఆర్. నర్సయ్య మాట్లాడుతూ, నిరంతర అభ్యాసం వలన నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు. క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గంగారెడ్డి వ్యాయమ ఉపాధ్యాయులు అనిల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# దైనందిన జీవితంలో క్రీడలు భాగం చేసుకోవాలి.






## కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

## ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం.





**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, నవంబర్ 16**

ఆరోగ్యాల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు తమ దైనందిన జీవితంలో క్రీడలను భాగంగా మల్చుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. మానసిక ఒత్తిడిని దూరం చేస్తూ, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, సహృద్భావ వాతావరణానికి బాటలు వేస్తాయని అన్నారు. నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం తెలంగాణ రాష్ట్ర స్థాయి ఓపెన్ మాస్టర్స్ బాడ్మింటన్ టోర్నమెంట్- 2024 క్రీడా పోటీలు ప్రారంభం అయ్యాయి. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనునిత్యం దైనందిన కార్యకలాపాలలో నిమగ్నమై ఉండే వివిధ వర్గాల వారికి మానసికోల్లాసానికి అందించేందుకు క్రీడలు ఉపకరిస్తాయని అన్నారు. ఈ దిశగా ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బాడ్మింటన్ క్రీడా పోటీలను నిర్వహిస్తుండడం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. నేటి తరం ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యతను ఇస్తూ క్రీడలు, వ్యాయామాలు, యోగా వంటి అభిరుచులను అలవర్చుకుంటున్నారని, ఇది ఆహ్వానించదగ్గ పరిణామమని అన్నారు. ఆఫీసర్స్ క్లబ్ లో సభ్యత్వం అంటేనే ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించబడుతుందని, దీని ప్రతిష్టను మరింతగా ఇనుమడింపజేసేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆఫీసర్స్ క్లబ్ అభివృద్ధికి తనవంతు తోడ్పాటును అందిస్తానని అన్నారు.

రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, ఆఫీసర్స్ క్లబ్ ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ, క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారని అన్నారు. కాగా, నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ కు స్విమ్మింగ్ పూల్ మంజూరు చేయించేందుకు జిల్లా యంత్రాంగం తరపున ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ను కోరగా, జిల్లా పాలనాధికారి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా టీజీవోల సంఘం అధ్యక్షుడు అలుక కిషన్, ఆఫీసర్స్ క్లబ్ ప్రతినిధులు వెంకటరమణ, గంగాకిషన్, భక్తవత్సలం, రాంకిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# గడుగుకు సెపక్ తక్రా జిల్లా కమిటీ సన్మానం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 16:**

రాష్ట్ర ఫార్మర్ వెల్ఫేర్ కమిషన్ డైరెక్టర్ గా ఎంపికైన జిల్లా కాంగ్రెస్ నాయకులు గడుగు గంగాధర్ ను జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గాధరి సంజీవ్ రెడ్డి, ఉపాధ్యక్షులు గడ్డం సతీష్ రెడ్డి, తాడేం మాజీ సర్పంచ్ జలంధర్ రెడ్డి శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా సెపక్ తక్రా ప్రధాన కార్యదర్శి సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ, మున్ముందు మరిన్ని పదవులు దక్కాలని, క్రీడాలకు సహకారం అందించాలని కోరారు.



# ఎ-ఎంపటి పరీక్షలో "నలంద"కు రాష్ట్ర స్థాయి ర్యాంకులు.

## - విద్యార్థులను అభినందించిన పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్.





**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, నవంబర్ 16:**



పట్టణంలోని నలంద హైస్కూల్ విద్యార్థులు (ఎ-ఎంపటి) ఆర్యభట్ట మెంటల్ ఎబిలిటీ టెస్ట్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి, తమ ప్రతిభను చాటారు. హైదరాబాద్ చెందిన ఈ- అభ్యస్ ఐఐటి అకాడమీ గత అక్టోబర్ నెలలో రాష్ట్రస్థాయిలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు దాదాపు రాష్ట్రంలోని 300 స్కూల్స్ నుండి విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష ఫలితాల్లో నలంద విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్టు పాఠశాల యాజమాన్యం శనివారం తెలిపారు. ఫలితాల్లో మొదటి మూడు స్టేట్ ర్యాంకులు తరగతుల వారీగా యాజమాన్యం తెలిపారు. 9వ తరగతిలో కీర్తిరెడ్డి, బాలాజీ, మధుశ్రీ, 8వ తరగతి లో కార్తికేయ, శ్రీ హార్షిణి, చిన్మాయి, 7వ తరగతిలో హరిణి, హర్షిత్, అర్హన్, 6వ తరగతిలో సంఘమిత్ర, వెంకటలక్ష్మి, ప్రీతిరెడ్డి, 5వ తరగతిలో సిందూష, విలక్షణ, అభినయ్. 4వ తరగతిలో ప్రాచీ, మోక్షిత్, లోహితరెడ్డి, యశ్విన్ రెడ్డిలు అన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సాగర్, కరస్పాండెంట్ ప్రసాద్ సర్టిఫికెట్స్ అందజేసి , అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమం లో ఐఐటి, ఒలంపియాడ్ ఇంచార్జ్ ఉపాధ్యాయులు సతీష్, సందీప్, శ్వేతా, నీకిలా, రాజశ్రీ, శారద లను నలంద యాజమాన్యం అభినందించారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఘనంగా అభినందించారు.

# కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలి.

## - తెలంగాణ విద్యా కమీషన్ చైర్మన్ కు టీపీటీఎఫ్ నేతల వెల్లడి.

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, నవంబర్ 16:**

రాష్ట్రంలో కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట కమిటీ తెలంగాణ విద్యా కమీషన్ చైర్మన్ ఆకునూరి మురళీ కు విన్నవించింది. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆహ్వానం మేరకు శనివారం ఎస్సీఈఆర్టీ కార్యాలయంలో విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులతో టిపిటిఎఫ్ రాష్ట్ర కమిటీ విద్యారంగంలో తీసుకరావల్సిన మార్పుల గురించి చర్చించారు. విద్యా విధానంపై కొన్ని ప్రతిపాదనలు చేస్తూ ఒక రిపోర్టును కమిషన్కు అందించడం జరిగింది.

ఈ సమావేశంలో టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యా రంగం సంక్షోభంలో ఉందని, మినిస్టర్ పిల్లలైనా, అటెండర్ పిల్లలైనా, కలెక్టర్ పిల్లలైనా, కార్మికుల పిల్లలైనా ఒకే పాఠశాలలో చదువుకునే కామన్ స్కూల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. రాజ్యాంగ లక్ష్యాలకు భిన్నంగా ఉన్న నూతన జాతీయ విద్యా విధానంను రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలని, పాఠశాల కరికులంలో శాస్త్రీయ విద్యా విధానానికి



అనుగుణంగా ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాలలో జరిగిన అభివృద్ధిని పాఠ్యాంశాలలో చేర్చాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక టీచర్ను, తరగతికి ఒక గది మరియు ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుల పోస్ట్ ను మంజూరు చేయాలని కోరారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేస్తూ పూర్వ ప్రాథమిక విద్య పై శిక్షణ పొందిన రెగ్యులర్ టీచర్ను నియమించాలని, పాఠశాలలో ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించకూడదని,

ఆన్లైన్ క్లరికల్ వర్క్ లేకుండా చేయాలని కోరారు. మండల, జిల్లా,జోనల్ స్థాయిలో రెగ్యులర్ పద్ధతిలో వెంటనే పర్యవేక్షణాధికారులైన డిఈఓ, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ పోస్టులు మంజూరు చేసి భర్తీ చేయాలని కోరారు.

చైర్మన్ ఆకునూరి మురళి మాట్లాడుతూ, విద్యారంగంలో కీలక భాగస్వాములైన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించి సిఫారసులు ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.

ఈసమావేశంలోరాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శియం. రవీందర్, ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకులు ఎం. ప్రకాష్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నన్నెబోయిన తిరుపతి, డి.శ్రీనివాస్, రాష్ట్ర మాజీ ఏపిటిఎఫ్ అధ్యక్షులు కె.వేణుగోపాల్, టిపిటిఎఫ్ మాజీ అధ్యక్షులు బి. కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీపీటీఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 16:**

జిల్లా టీపీటీఫ్ ఎన్నికలు శనివారం శంకర్ భవన్ పాఠశాలలలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. మహేందర్ రెడ్డి పర్యవేక్షణ లో జరిగాయి. జిల్లా అధ్యక్షులు వెనిగల్ల సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పూదరి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షులు గా బి. మల్లేశం, భారతి, ఇబ్రహీం కే.గంగా ప్రసాద్ లను ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శులు గా పి.రేణుక, సురేష్, నరేందర్, బి. రామకృష్ణ లను జిల్లా కౌన్సిలర్లు ఏకగ్రీవముగా ఏన్నుకున్నారు.

# జనవరిలో మెట్రో రైల్ ఫేజ్-2 పనులు

హైదరాబాద్: మెట్రోరైల్ ఫేజ్-2 పనులు జనవరిలో ప్రారంభం కానున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేసే క్రమంలో కారిడార్-6 మహాత్మాగాంధీ బస్ స్టేషన్ నుంచి చాంద్రాయణగుట్టను

ఎంపిక చేశారు. ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట వరకూ 7.5 కిలోమీటర్ల మార్గంలో ఇరువైపులా 200 ప్రైవేటు స్థలాలను సేకరించేందుకు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ప్రాథమిక డిక్లరేషన్ జారీ చేశారు. ఈ ప్రక్రియ అనంతరం డిసెంబరులో అవార్డు ప్రకటించనున్నారు. అవార్డు ప్రకటనతో నిర్మాణ పనులను నిరాటంకంగా ప్రారంభించేందుకు అవకాశాలుంటాయి. ప్రాథమిక డిక్లరేషన్ నుంచి అవార్డు ప్రకటన వరకూ రెవెన్యూ అధికారులు వివిధ స్థాయుల్లో సమాచారం సేకరించనున్నారు.

**ఎలివేటెడ్ కారిడార్లకు త్వరలో..**

సికింద్రాబాద్- కండ్లకోయ 18.3 కి.మీ., సికింద్రాబాద్- శామీర్‌పేట 11.3 కి.మీ. మేర రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్లకు అవసరమైన ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల సేకరణకు హైదరాబాద్ రెవెన్యూ అధికారులు మరో నాలుగు రోజుల్లో ప్రాథమిక నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు.



# సామాజిక సర్వేను సమీక్షించిన మున్సిపల్ కమిషనర్.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 16:**

నగరం పరిధిలో జరుగుతున్న సామాజిక ఆర్థిక సర్వే 2024 ప్రగతిని నగర కమిషనర్ దిలీప్ కుమార్ సూపర్వజర్ అధికారులతో శనివారం మున్సిపల్ కార్యాలయంలో సమీక్షించారు. ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఎన్యుమ్ రేటర్లచే పూర్తి చేయించాలి అని సంబంధిత అధికారులకు, సిబ్బందికి ఆదేశించారు. అడిగిన సమాచారాన్ని ఇచ్చి ఎనుమరేటర్లకు సహకరించాల్సిందిగా నగర ప్రజలకు కమిషనర్ కోరారు. ఈ సమీక్ష సమావేశంలో నగర పాలక సంస్థ అధికారులు, సూపర్వైజరీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లక్షకు రూ.33 లక్షలు!

మల్టీబ్యాగర్ స్టాక్ తమ ఇన్వెస్టర్లకు మల్టీబ్యాగర్ రిటర్న్లు అందించింది. ఇప్పుడు ఒక షేరు ఉంటే మరో షేరు ఉచితంగా అందిస్తోంది. దీంతో గత 5 సెషన్లలోనే 16 శాతానికిపైగా పెరిగింది. ఈ స్టాక్ గురించి ఇప్పుడే తెలుసుకోండి. దేశీయ స్టాక్ మార్కెట్లో కొన్ని స్టాక్స్ దీర్ఘకాలంలో మంచి రిటర్న్లు అందిస్తుంటాయి. అలాంటి కోవకే చెందుతుని ప్రముఖ సర్ఫేస్ ఫినిషింగ్, ఇంజినీరింగ్ సొల్యూషన్స్ కంపెనీ గ్రేయర్ అండ్ వెయిల్ ఇండియా లిమిటెడ్ స్టాక్. ఈ కంపెనీ గ్రోవెల్ గా సుపరిచితం. ఇండస్ట్రీయల్, కన్జ్యూమర్ మార్కెట్ల్ రెండింటిలోనూ సేవలందిస్తోంది. సర్ఫేస్ ఫినిషింగ్, ఇంజనీరింగ్ సొల్యూషన్స్ సహా ఆటోమొబైల్, రిఫైనరీస్ ఇండస్ట్రీస్ కి కోటింగ్స్ , కెమికల్, ఈక్విప్మెంట్ అందిస్తుంటుంది. ఈ కంపెనీ షేర్లు గత వారం రోజులుగా రాణిస్తున్నాయి. గ్రేయర్ అండ్



వెయిల్ ఇండియా లిమిటెడ్ షేర్లు ఇవాళ లాభాల స్వీకరణతో నష్టాల్లో ట్రేడింగ్ అవుతున్నాయి. ప్రస్తుతం 0.61 శాతం నష్టంతో రూ.195 వద్ద ట్రేడింగ్ అవుతోంది. అయితే, గత 5 సెషన్లలో చూసుకుంటే ఈ షేరు 16 శాతానికిపైగా లాభపడింది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ.204.80 వద్ద ఉంది. క్రితం రోజునే ఈ స్థాయిని తాకడం గమనార్హం. అలాగే 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.88.85 వద్ద ఉంది. ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.4420 కోట్లుగా ఉంది.

బోనస్ షేర్లు.. ఈ కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు బోనస్ షేర్లకు ఇటీవలే ఆమోదం తెలిపారు. 1:1 రేషియోలో బోనస్ షేర్లు అందించేందుకు నిర్ణయించారు. అంటే రికార్డ్ తేదీ నాటికి డీమ్యాట్ ఖాతాలో 1 ఈక్విటీ షేర్ కలిగి ఉన్న వారికి మరో ఈక్విటీ షేరు బోనస్ గా లభిస్తుంది. అయితే, దీనికి సంబంధించిన రికార్డు తేదీని ఇంకా ప్రకటించలేదు. ఈ కంపెనీ డివిడెండ్ పేఔట్ 17.1 శాతంగా ఉంది. క్యూ3 త్రైమాసిక ఫలితాలు చూసుకుంటే కంపెనీ నెట్ సేల్స్ 13.5 శాతం పెరిగి రూ.285 కోట్లుగా నమోదైంది. అలాగే కంపెనీ నెట్ ప్రాఫిట్ 26.5 శాతం పెరిగి రూ.43 కోట్లుగా నమోదు చేసింది.

లక్షకు రూ.33 లక్షలు..

ఈ స్టాక్ తమ వాటాదారులకు మల్టీబ్యాగర్ రిటర్న్లు అందించింది. గత ఏడాది కాలంలో చూసుకుంటే 100 శాతం రిటర్న్లు ఇచ్చింది. అలాగే మూడేళ్లలో చూసుకుంటే 365 శాతం పెరిగింది. మరోవైపు.. గడిచి దశాబ్ద కాలంలో చూసుకుంటే ఈ షేరు రూ.5.85 స్థాయి నుంచి ఏకంగా రూ.204 స్థాయికి పెరిగింది. అంటే ఈ పదేళ్లలో 3,350 శాతం పెరిగింది. పదేళ్ల క్రితం రూ.1 లక్ష పెట్టి షేర్లు కొనుగోలు చేసిన వారికి ఇప్పుటు ఆ విలువ రూ.34 లక్షల వరకు ఉంటుంది.

# బెస్ట్ మ్యూచువల్ ఫండ్స్ ఇవే..

**బ్యాంక్ ఆఫ్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ గడిచిన 5 ఏళ్ల కాలంలో రూ. 10 వేలు ఎస్ఐపీ ని రూ. 13.53 లక్షలు చేసింది**



మీరు మ్యూచవల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నారా? బెస్ట్ మ్యూచువల్ ఫండ్స్ కోసం చూస్తున్నారా? అయితే ఇది మీకోసమే. గత 5 ఏళ్ల కాలంలో హైరిటర్న్లు అందించిన టాప్-10 మ్యూచువల్ ఫండ్స్ లిస్ట్ ఇదే. ఓసారి పరిశీలించండి.

ఇటీవలి కాలంలో మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అందులో సిస్టమాటిక్ ఇన్వెస్ట్మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా ఎక్కువ మంది ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ లో పెట్టుబడి పెడుతున్నారు. మార్కెట్ పరిస్థితులతో సంబంధం లేకుండా క్రమం తప్పకుండా ఒక నిర్దిష్ట మొత్తాన్ని ఇన్వెస్ట్ చేసేందుకు ఈ ప్లాన్ సాయపడుతుంది. చాలా ఫండ్స్ మంచి రిటర్న్లు అందిస్తున్న క్రమంలో ఎక్కువ మంది ఇటువైపు తమ పెట్టుబడులను మళ్లిస్తున్నారు. మరి మీరు కూడా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్ చేసేందుకు బెస్ట్ ఫండ్స్ కోసం చూస్తున్నారా? అయితే, గత 5 ఏళ్ల సమయంలో ఇన్వెస్టర్లకు మంచి రిటర్న్లు అందించిన టాప్ 10 మ్యూచువల్ ఫండ్స్ గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం. ఇవి ఏకంగా 33.22 శాతం నుంచి 48.22 శాతం మేర వార్షిక రిటర్న్లు అందించాయి.

రూ.10 వేల సిప్‌తో రూ.19 లక్షలు..

క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్ గత ఐదేళ్లలోనే హైరిటర్న్లు అందించింది. ప్రతి నెల రూ.10 వేలు సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ద్వారా పెట్టుబడి పెట్టిన వారికి 48.22 శాతం వార్షిక రిటర్న్లు తో ఏకంగా రూ.19.01 లక్షల కార్పస్ ఏర్పడింది. ఆ తర్వాత క్వాంట్ మిడ్ క్యాప్ ఫండ్ 37.46 శాతం వార్షిక రిటర్న్లు తో రూ.10 వేల సిప్ ను ఐదేళ్లలో రూ.14.81 లక్షలు చేసింది.

టాప్-10 మ్యూచువల్ ఫండ్స్ ఇవే..

క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్ 5 ఏళ్లలో రూ.10 వేల సిప్ ను రూ.19.01 లక్షలు చేసింది. ఎక్స్ఐఆర్ఆర్ 48.52 శాతంగా ఉంది.

క్వాంట్ మిడ్ క్యాప్ ఫండ్ రూ.10 వేల సిప్ తో 5 ఏళ్లలో రూ.14.81 లక్షలు చేసింది. దీని ఎక్స్ఐఆం ఆర్ 37.46 శాతంగా ఉంది.నిప్పాన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ రూ.10 వేలు నెల నెల పెట్టుబడి పెట్టి ఉంటే 5 ఏళ్లలో రూ.14.79 లక్షలు అయి ఉండేది. దీని ఎక్స్ఐఆర్ఆర్ 37.4 శాతంగా ఉంది.

క్వాంట్ ఫ్లెక్సి క్యాప్ ఫండ్లో రూ. 10 వేలు ఎస్ఐపీ చేసి ఉంటే రూ. 14.49 లక్షలు అయి ఉండేది. ఎక్స్ఐఆర్ఆర్ 36.51 శాతంగా ఉంది. క్వాంట్ ఈఎల్ఎస్ఎస్ ట్యాక్స్ సేవర్ ఫండ్ సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ద్వారా రూ. 10 వేలు పెట్టుబడి పెట్టి ఉంటే 5 ఏళ్లలో రూ. 14.28 లక్షలు వచ్చేవి. ఎక్స్ఐఆర్ఆర్ రూ. 35.88 శాతంగా ఉంది.

హెచ్ఎస్‌బీసీ స్మాల్ క్యాప్ ఫండ్ గడిచిన 5 ఏళ్ల కాలంలో రూ. 10 వేలు ఎస్ఐపీని.. రూ.13.62 లక్షలు చేసింది. దీని వార్షిక రిటర్న్లు 33.82 శాతంగా ఉన్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్‌బీఐ కాంట్రా ఫండ్ గత 5 ఏళ్లలో రూ. 10 వేలు సిప్ ని రూ 13.53 లక్షలు చేసింది. ఎక్స్ఐఆర్ఆర్ 33.56 శాతంగా ఉంది. బ్యాంక్ ఆఫ్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ గడిచిన 5 ఏళ్ల కాలంలో రూ. 10 వేలు ఎస్ఐపీ ని రూ. 13.53 లక్షలు చేసింది. ఎక్స్ఐఆర్ఆర్ 33.55 శాతంగా ఉంది.

ఫ్లాంక్లిన్ ఇండియా స్మాలర్ కాస్ ఫండ్ లో 5 ఏళ్ల పాటు రూ. 10 వేలు ఎస్ఐపీ చేసి ఉంటే ఇప్పుడు వాటి విలువ రూ. 13.45 లక్షలు అయి ఉండేది. దీని ఎక్స్ఐఆర్ఆర్ 33.27 శాతంగా ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ స్మాల్ క్యాప్ ఫండ్ లో గత 5 ఏళ్లుగా రూ. 10 వేలు ఎస్ఐపీ చేసిన వారికి ఇప్పుడు వాటి విలువ రూ. 13.43 లక్షలు అయ్యేది. ఈ ఫండ్ వార్షిక రిటర్న్లు ఎక్స్ఐఆర్ఆర్ 33.22 శాతంగా ఉంది.

# ఆధార్ కార్డులో మీ ఫొటో నచ్చట్లేదా?

ఆధార్ కార్డు భారతీయులకు అత్యంత ముఖ్యమైన డాక్యుమెంట్లలో ఒకటి. చాలా వరకు గుర్తింపు కార్డుగా, ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలన్నా ఇదే అవసరం. అయితే ఆధార్ కార్డులో పేరు, అడ్రస్, పుట్టిన తేదీ వంటివి మార్చుకోవచ్చన్న సంగతి తెలిసిందే. చాలా మందికి ఆధార్ కార్డులో ఫొటో నచ్చదు. దీనిని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో ఎలా మార్చుకోవచ్చనేది ఇప్పుడు తెలుసుకుందాం. భారత పౌరులకు ఆధార్ కార్డు అనేది తప్పనిసరి. కేంద్ర విశిష్ట గుర్తింపు, ప్రాధికార సంస్థ దీనిని జారీ చేస్తుంటుంది. ఈ 12 అంకెల ఆధార్ నంబర్‌లోనే మన ప్రాథమిక సమాచారం అంతా నిక్షిప్తమై ఉంటుంది. మన పేరు, చిరునామా, పుట్టినతేదీ, లింగం, ఫొటో, ఫోన్ నంబర్ సహా బయోమెట్రిక్ వివరాలు అందులో ఉంటాయి. అయితే మన ఆధార్ కార్డులో వివరాలు సరిగ్గా ఉండాలి. ఎప్పటికప్పుడు అప్‌డేటెడ్‌గా ఉండాలి. పేరు స్పెల్లింగ్ మిస్టేక్ ఉండొద్దు. చిరునామా సరైనది ఉండాలి. అయితే వీటిల్లో ఏదైనా అప్డేట్ చేసుకోవాలంటే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో చేసుకోవచ్చు. ఆధార్ కార్డులో వివరాల్ని చాలా మంది అప్డేట్ చేస్తూనే ఉంటారు. ఆధార్ సెంటర్ల దగ్గర క్యూ కూడా మనం గమనిస్తూనే ఉంటాం. పేరు, పుట్టినతేదీ, అడ్రస్ వంటివి అయితే ఆన్‌లైన్‌లో మీరే చేసుకోవచ్చు.

ఆధార్ కార్డులో ఉండే ఫొటో అయితే చాలా మందికి నచ్చదు. చాలా సంవత్సరాల కిందట దిగి ఉంటారు కాబట్టి.. అది అంత బాగోకపోవచ్చు. అందుకే ఆధార్ కార్డుల్ని వారు ఇతరులకు చూపించేందుకు కూడా మొహమాటపడుతుంటారు. అందుకే ఫొటో ఆధార్ కార్డులో ఎలా మార్చుకోవాలనేది చూద్దాం. అయితే ఫొటో, కనుపాప, వేలిముద్రలు అనేవి బయోమెట్రిక్ కిందకు వస్తాయి.


వీటి కోసం కచ్చితంగా ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సిందే.

ఆన్‌లైన్ నుంచి ఆఫ్‌లైన్ ద్వారా ఎలా?

తొలుత ఆధార్ అధికారిక వెబ్‌సైట్‌లోకి https://uidai.gov.in/en వెళ్లాలి. స్క్రీన్‌పై హోం పేజీ కనిపిస్తుంది. అక్కడ మైఆధార్‌లో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఫామ్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. దానిని ప్రింట్ అవుట్ తీసుకోవాలి. అడిగిన అన్ని వివరాల్ని ఫిల్ చేయాలి. తర్వాత ఆ ఫాంతో దగ్గర్లోని ఆధార్ కేంద్రానికి వెళ్లాలి. సంబంధిత అధికారులకు ఆ ఫాం సబ్మిట్ చేయాలి. మీ బయోమెట్రిక్ వివరాల్ని కూడా నమోదు చేయించుకోవాలి.అప్పుడు అధికారులు మీ లైవ్ ఫొటో తీసుకుంటారు. అప్‌డేట్ రిక్వెస్ట్ నంబర్‌తో మీకు ఒక అక్‌నాలెడ్జ్‌మెంట్ స్లిప్ ఇస్తారు. దీనితో మీ అప్లికేషన్‌ను ఎప్పటికప్పుడు ట్రాక్ చేసుకోవచ్చు.

# మళ్లీ తగ్గిన బంగారం ధరలు..

ఫిబ్రవరి నెలలో బంగారం రేట్లు ఊరట కలిగించాయని చెప్పొచ్చు. అంతకుముందు జనవరి నెలలో భారీగా పెరిగినప్పటికీ.. ఈ నెలలో పెద్దగా పెరగలేదు. ఇవాళ కూడా బంగారం రేటు దిగొచ్చింది. వెండి ధర కూడా స్వల్పంగా తగ్గింది. ఇప్పుడు ఎక్కడ గోల్డ్, సిల్వర్ రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. బంగారం రేట్లు పెద్దగా పెరగట్లేదు. పైగా వరుసగా తగ్గుతుండటం గమనార్హం. ఈ నెలలో ఎక్కువగా పెరిగిందే లేదు. ఎక్కువగా స్థిరంగా ఉంటూ వస్తున్నప్పటికీ.. తగ్గుదల కూడా కనిపించింది. ఈ నెలలో ఓవరాల్‌గా చూసినట్లయితే బంగారం రేటు దిగొచ్చిందని చెప్పొచ్చు. కిందటి రోజు స్థిరంగా ఉన్న రేట్లు మళ్లీ ఇవాళ పడిపోవడం విశేషం. వెండి ధరలు హైదరాబాద్‌లో స్థిరంగా ఉండగా.. మరోవైపు ఢిల్లీలో దిగొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లలో చూసినట్లయితే రేట్లు అక్కడ కూడా స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ఇప్పుడు లేటెస్ట్ బంగారం, వెండి ధరల గురించి చూద్దాం. ఇంటర్నేషనల్ మార్కెట్లలో స్వల్ప మార్పు జరగ్గా ప్రస్తుతం స్పాట్ బంగారం రేటు ఔన్సుకు అక్కడ 2032 డాలర్ల వద్ద కొనసాగుతోంది. స్పాట్ సిల్వర్ రేటు మాత్రం 22.50 డాలర్లకు పడిపోవడం గమనార్హం. రూపాయి మారకం విలువ మెరుగవుతోంది. డాలర్‌తో పోలిస్తే ఇప్పుడు అది రూ. 82.895 వద్ద ట్రేడవుతోంది. హైదరాబాద్‌లో బంగారం ధర తాజాగా దిగొచ్చింది. తులం బంగారం ధర రూ. 100 తగ్గగా 22 క్యారెట్లకు ప్రస్తుతం రూ. 57,600 మార్కుకు చేరింది. ఇక స్వచ్ఛమైన బంగారం ధర 24 క్యారెట్లపై రూ. 110 పడిపోగా తులానికి ఇప్పుడు రూ. 62,840కి చేరింది. దేశ రాజధాని ఢిల్లీ మార్కెట్లో కూడా బంగారం రేట్లు ఇలాగే పడిపోగా ప్రస్తుతం 22 క్యారెట్స్ తులం గోల్డ్ అక్కడ రూ. 57,750 పలుకుతోంది. అదే 24 క్యారెట్ల పుత్తడి ధర రూ. 62,940 కి పడిపోయింది. సిల్వర్ రేట్లు చూసినట్లయితే ఢిల్లీ మార్కెట్లో ఒక్కరోజే రూ. 400 తగ్గగా కేజీ వెండి ధర ప్రస్తుతం రూ. 74,500 కు పడిపోయింది. అంతకుముందు రోజు స్థిరంగా ఉంది. హైదరాబాద్ నగరంలో వెండి ధరలు మారలేదు. ఇక్కడ కిలో రూ. 76,400 పలుకుతోంది. ఇక స్థానిక పన్ను రేట్లను బట్టి.. గోల్డ్, సిల్వర్ రేట్లు ప్రాంతాల్ని బట్టి మారుతుంటాయి. బంగారం ధరలు అందుబాటులోకి రావడానికి ప్రధాన కారణం.. ఫెడ్ ఇటీవల వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచుతూ ప్రకటించడమే. ఈసారి తగ్గిస్తుందని అంచనాలు ఉన్నా అలా చేయలేదు. మార్చి వడ్డీ రేట్లను తగ్గించనున్నట్లు సంకేతాలు ఇచ్చింది.




# కన్నప్పతోనైనా మంచు విష్ణుకు హిట్టు పడేనా..?

మంచు విష్ణు హీరోగా ఎంట్రీ ఇచ్చి రెండు దశాబ్దాలు దాటింది. ఇన్నాళ్ల సినీ ప్రస్థానంలో విష్ణు దక్కించుకున్న విజయాలు ఎన్ని అంటే చాలా చాలా తక్కువ అని చెప్పాలి. కెరీర్ ఆరంభంలో కాస్త పర్వాలేదు అనిపించినా గత పదేళ్ల కాలంలో ఆయన నుంచి వచ్చిన సినిమాలు తక్కువే, అందులో ఆయనకు ఒక్క హిట్టు కూడా లేదు. అయినా తన ప్రయత్నాలు మాత్రం ఆపడం లేదు. ప్రస్తుతం భారీ బడ్జెట్‌తో స్వీయ నిర్మాణంలో మంచు విష్ణు 'కన్నప్ప' సినిమాను చేస్తున్నారు. మంచు విష్ణు సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి 20 ఏళ్లు పూర్తి అయింది. మొదటి పదేళ్లు స్పీడ్‌గా



సినిమాలు చేసి, పర్వాలేదు అన్నట్లు ఫలితాలు సొంతం చేసుకున్న విష్ణుకు కొన్ని సూపర్ హిట్‌లు సైతం దక్కాయి. కానీ గత పదేళ్లుగా ఒక్క సినిమా సైతం హిట్ కాలేదు. పైగా ప్రతి సినిమా డిజాస్టర్, అంతకు మించి అన్నట్లుగా దారుణ ఫలితాలను చవిచూశాయి. విభిన్న చిత్రాలను ఎంపిక చేసుకుని, ప్రతి సినిమాకు చాలా కష్టపడుతున్నా మంచు విష్ణుకు ఆశించిన సక్సెస్ మాత్రం రావడం లేదనిపిస్తుంది. తనపై ఎంతగా విమర్శలు వచ్చినా, తన సినిమాలు ఎంతటి డిజాస్టర్‌ను చవిచూసినా తన ప్రయత్నాలను మాత్రం మానడం లేదు. సినిమాపై ఉన్న ఆసక్తితో వరుసగా ప్రాజెక్టులు చేస్తూనే ఉన్నాడు. ఈసారి ఏకంగా భారీ బడ్జెట్‌తో 'కన్నప్ప' అనే సినిమాను చేస్తున్నారు. మొదట్లో అనుకున్న స్థాయికి రెట్టింపు కన్నప్ప బడ్జెట్ చేరినట్టుగా కనిపిస్తోంది. భారీ క్యాస్టింగ్‌తో కన్నప్పను గ్రాండ్ లెవెల్లో విష్ణు నిర్మిస్తున్నాడు.

# కుబేర పోస్టర్ విడుదల


## కీలక పాత్రలో అక్కినేని నాగార్జున

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం కుబేర. ఈ చిత్రంలో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. అక్కినేని నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్నాడు. తాజాగా కుబేర గ్లింప్స్ అప్‌డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. గ్లింప్స్‌ను ఇవాళ సాయంత్రం 5:31 గంటలకు విడుదల చేయనున్నట్టు ప్రకటిస్తూ.. షేర్ చేసిన లుక్‌లో ధనుష్, అపార్ట్‌మెంట్స్, బిల్డింగ్స్, నోట్లను చూడొచ్చు. ఈ లుక్ గ్లింప్స్, సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. ధైర్యవంతులనే అదృష్టం వరిస్తుంది.. అంటూ చెదిరిన వెంట్రుకలు, మాసిన గడ్డంతో నవ్వుతూ కనిపిస్తున్న ధనుష్ లుక్ ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రాన్ని ఏషియన్ సినిమాస్ బ్యానర్‌పై సునీల్ నారంగ్, పీ రామ్‌మోహన్ రావు సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. సోషల్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీని ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నారు. కుబేరలో పాపులర్ బాలీవుడ్ యాక్టర్ జిమ్ సర్బ్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. ఇప్పటికే విడుదల చేసిన జిమ్ సర్బ్ పాత్ర లుక్‌లో.. స్టైలిష్ సూట్‌లో నోట్ల కట్టల మధ్య నిల్చొని ఆసక్తిని రేకెత్తిస్తున్నాడు.

# దేవర-2పై అనుమానాలొద్దు



ఎన్టీఆర్ 'దేవర' సినిమా థియేటర్ రిలీజ్ 50 రోజులు పూర్తి చేసుకుంది. ఓటీటీ స్ట్రీమింగ్ తర్వాత థియేటర్‌లలో రన్ అయ్యి 50 రోజులు పూర్తి చేసుకున్న 'దేవర' సినిమా అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద రూ.500 కోట్లకు పైగా వసూళ్లు చేసిందని సమాచారం అందుతోంది. టాలీవుడ్ టాప్ చిత్రాల జాబితాలో నిలిచిన 'దేవర' సినిమాకు పార్ట్ 2 అవసరం లేదనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. దర్శకుడు కొరటాల శివ, హీరో ఎన్టీఆర్ సైతం అదే ఫీల్ అవుతున్నారేమో అంటూ కొందరు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఎన్టీఆర్ ఫ్యాన్స్ మాత్రం ఆ ప్రచారంను తిప్పి కొడుతున్నారు. రూ.500 కోట్ల వసూళ్లు సాధించిన సూపర్ హిట్ సినిమాకి సీక్వెల్ చేయకుండా ఎలా వదిలేస్తారంటూ వారు ప్రశ్నిస్తున్నారు.




# హాయ్.. నేను రానా దగ్గుబాటి..

## ట్రైలర్ షో విడుదల

టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గు బాటి కాంపౌండ్ నుంచి టాక్ షో సందడి చేయబోతున్న విషయం తెలిసిందే. తాజాగా ది రానా దగ్గుబాటి షో ట్రైలర్‌ను విడుదల చేశారు. హాయ్.. నేను రానా దగ్గుబాటి.. అవును ఇది ఒక షో. కానీ మీరంతా ఈ షో దేని గురించి ఆశ్చర్యపోతున్నారు. నాకింకా ఏం తెలియదు.. అంటూ ఇంట్రో మొదలుపెట్టాడు రానా.ఆ తర్వాత షోలోకి గెస్టులుగా నాగచైతన్య, శ్రీలీల, సిద్దు జొన్నలగడ, నాని, ప్రియాంకా ఆరుళ్ మోహన్, ఎస్ఎస్ రాజమౌళి, తేజ సజ్జా దుల్కర్ సల్మాన్, రాంగోపాల్ వర్మ, మీనాక్షి చౌదరి, రిషబ్ శెట్టి లాంటి స్టార్లు ఎంట్రీ ఇచ్చారు. స్టార్ సెలబ్రిటీలతో టాక్ షో ఉండబోతున్నట్టు రానా తెలియజేశాడు. రానా అండ్ సెలబ్రిటీల స్టైల్‌లో సాగే ఈ సిరీస్ నవంబర్ 23న అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రీమియర్ కానుంది. ఫిల్టర్ చేయని, స్క్రిప్ట్ లేని.. మరిచిపోలేనిది.. అంటూ విడుదల చేసిన ట్రైలర్ నెట్టింట వైరల్ అవుతోంది. రానా చేయబోయే షోలో రొటీన్ అంశాలే ఉండబోతున్నాయా.. ? లేదా ప్రేక్షకులకు కొత్త యాంగిల్ ఏమైనా చూపించడబోతున్నాడా..? అన్నది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.



# నయన ప్రేమకథ అలా మొదలైంది..?

అగ్ర నాయిక నయనతారను ఆమె అభిమానులు లేడీ సూపర్‌స్టార్ అని గర్వంగా పిలుచుకుంటారు. బుల్లితెర ప్రయోక్తగా కెరీర్‌ను మొదలుపెట్టి అగ్ర కథానాయికగా ఎదిగిన ఆమె ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. ఈ నేపథ్యంలో 'నయనతార: బీయాండ్ ది ఫెయిరీటేల్' పేరుతో ఆమె విజయవంతమైన సినీ ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ రూపొందిన డాక్యుమెంటరీ త్వరలో నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. ఇందులో ఆమె వ్యక్తిగత, సినీ జర్నీకి సంబంధించిన అనేక ఆసక్తికరమైన అంశాలను పొందుపరిచారు. తమిళ దర్శకుడు విఘ్నేష్ శివన్‌తో నయనతార ప్రేమాయణం, పెళ్లి వరకు సాగిన వారి ప్రయాణాన్ని కూడా ఈ డాక్యుమెంటరీలో వివరించారని తెలిసింది. ఈ సందర్భంగా విఘ్నేష్ శివన్‌తో తాను ప్రేమలో పడిన క్షణాలను నయనతార గుర్తు చేసుకుంది. విఘ్నేష్‌శివన్ దర్శకత్వం వహించిన 'నానుమ్ రౌడీదాన్' (2015) సెట్స్‌లో తొలిసారి వీరిద్దరూ కలుసుకున్నారు. నయనతార మాట్లాడుతూ 'పాండిచ్చేరిలోని ఓ మారుమూల ప్రాంతంలో షూటింగ్ పెట్టారు. విజయ్ సేతుపతి మీద సీన్స్ షూట్ చేస్తున్నారు. అప్పుడే నేను దూరంగా విఘ్నేష్ శివన్‌ను గమనించా. మోముపై చెరగని చిరునవ్వు, సన్నివేశాన్ని వివరించే శైలి, దర్శకుడిగా అతని ప్రత్యేకమైన పనితీరు నన్ను ఆకట్టుకుంది. ఆ క్షణంలోనే అతని ప్రేమలో పడిపోయా' అని నయనతార చెప్పింది. దాదాపు ఏడేళ్ల సుదీర్ఘ ప్రేమాయణం అనంతరం 2022 జూన్ 9న ఈ జంట వివాహం చేసుకున్నారు. ఈ దంపతులు సరోగసీ విధానం ద్వారా ఉయిర్, ఉలగం అనే కవల పిల్లలకు తల్లిదండ్రులయ్యారు.

# థియేటర్ దగ్గర

## స్టెప్పులేసిన పుష్ప యాక్టర్



పుష్ప ది రైజ్ సినిమాలో జాలిరెడ్డి పాత్రతో తెలుగు ప్రేక్షకుల్లో సూపర్ ఫేం సంపాదించాడు కన్నడ యాక్టర్ ధనుంజయ. కన్నడలో సూపర్ పాపులర్ అయిన ఈ టాలెంటెడ్ యాక్టర్ ఓ థియేటర్ ముందు అభిమానులతో కలిసి డ్యాన్స్ చేశాడు. ఇంతకీ స్పెషల్ ఏంటనే కదా మీ డౌటు. కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ నటించిన యాక్షన్ థ్రిల్లర్. ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ మూవీ స్క్రీనింగ్ సందర్భంగా బెంగళూరులోని నర్తకి థియేటర్ వద్ద ధనుంజయ అభిమానులతో కలిసి డ్యాన్స్ చేసిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ధనుంజయ ప్రస్తుతం సీక్వెల్ పుష్ప 2 ది రూల్‌లో నటిస్తుండగా డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ధనుంజయ మరోవైపు సత్యదేవ్‌తో కలిసి నటిస్తోన్న చిత్రం జీబ్రా. ఈ మూవీ నవంబర్ 22న థియేటర్లలో సందడి చేయనుంది. శివ రాజ్ కుమార్‌కు తెలుగులో కూడా మంచి క్రేజ్ ఉందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ స్టార్ యాక్టర్ రాంచరణ్ ఆర్‌సీ 16లో, విజయ్ దళపతి 69లో కీ రోల్స్‌లో నటిస్తున్నాడు.